## ఆర్టీసీ కాలనీ నుంచి బస్సు ప్రారంభం




ఆర్టీసీ కాలనీ నుంచి బస్సును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణివెంకట్ రావు

**రామంతాపూర్, మే 12 :** రామంతపూర్ డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ నుంచి 18R జేబీఎస్‌కి వెళ్లడానికి ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన బస్సును సోమవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు ప్రారంభించారు.అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ఆర్టీసీ కాలనీ నుంచి మరొక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## నాచారంలో 'భవన కార్మిక జేఏసీ' ఏర్పాటు

**ఉప్పల్, మే 12:** నాచారంలోని బీఎస్పీ కార్యాలయంలో సోమవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నల్లా రాధా కృష్ణ హాజరై మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వివరించారు. పథకాలు పొందాలంటే ప్రతిఒక్కరు లేబర్ గుర్తింపు కార్డును పొందాలని సూచించారు. ఈ సందర్భంగా భవన కార్మిక జేఏసీ కార్తికేయ నగర్, ఎర్రకుంట అడ్డ కమిటీని ప్రకటించారు. కన్వీనర్ గా బొడ్డు శివ అరుణకాంత్, ప్రెసిడెంట్ గా మద్దికుంట్ల వెంకన్న, జనరల్ సెక్రటరీగా తేజావత్ వీరన్న, వైస్ ప్రెసిడెంట్‌గా దావుల సైదులు, జాయింట్ సెక్రటరీ గా అవుదొడ్డి అంజయ్య ఎన్నికైనారు. ఈ మేరకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లా రాధా కృష్ణ, కనకమేడల రాంబాబు, కరాటే శ్రీరామ్, టి రాజబాబు, కనుకుంట్ల విజయ్, మల్కారీ అశోక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.




నూతనంగా ఏర్పాటైన జేఏసీ ప్రతినిధి కమిటీ

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**మేడ్చల్ కలెక్టరేట్, మే 12 :** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను నుంచి లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ ప్రజావాణిలో భాగంగా అర్జీలను స్వీకరించారు. 60 మంది వివిధ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులను అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

**కాప్రా:** కాప్రాసర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు అందాయి. మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ఫస్ట్‌ఫేజ్‌లో ప్రతి శనివారంవారం జరిగే వారాంతపు సంత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాల ని కోరుతూ ఆనంద్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శివరాంప్రసాద్, గోవిందరెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కుషాయిగూడ వీ.ఎన్.రెడ్డినగర్‌లో అనుమతిలేకుండా నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కాప్రా డివిజన్ ప్రథమపురి కాలనీలో ప్లాట్ నంబర్ 45లో అనుమతులు లేకుండా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న కార్ మెకానిక్ షెడ్ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులను పరిశీలించి తగువిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కాప్రాసర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ ఆదేశించారు.

## సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

**మేడ్చల్, మే 12:** ఈనెల 20న జరిగే దేశవ్యాప్త నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను సోమవారం సీఐటీయూ మేడ్చల్ మండల కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తుందన్నారు. మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నదని విమర్శించారు. 100 సంవత్సరాలలో సాధించుకొన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోట్లను ముందు కు తెచ్చిందన్నారు. రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 60 వేల మంది ఉద్యోగులు, కార్మికులకు పని భద్రత లేదని, పర్మినెంట్ చేయడం లేదని, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా లాంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. హక్కులు, డిమాండ్ల సాధనకు రాష్ట్ర కార్మికవర్గం ఈనెల 20న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులందరూ ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నర్సింగ్ రావు, వసంత, మల్లేష్, కొమురయ్య, పూజ, నర్సింగ్ రావు, ప్రశాంత్, రమేష్ పాల్గొన్నారు.

### నేడు కీసరలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

**కీసర, మే 12:** కీసరలోని రైతు వేదికలో ఈనెల 13న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయాధికారి మాధవిలత తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటలకు కీసరలోని రైతు వేదికకు రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు విచ్చేస్తున్నారని అన్నారు. పంటలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అందుకు కీసరలోని రైతులందరు సకాలంలో తరలిరావాలని కోరారు.

## పంట మార్పిడితోనే అధిక దిగుబడి

**పోచారం,మే12:** రైతులు తరుచూ పంటల మార్పిడి చేస్తేనే ఆశించిన దిగుబడులు పొందుతారని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడురాములు నాయక్ అన్నారు. సోమవారం పోచారం మున్సిపాలిటీలో నిర్వహించిన రైతుల వద్దకు శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడా రు. రైతులు భూసార పరీక్షలు చేయించి తమ భూమిలో ఏ పంటలు అనుకూలమో గుర్తించి ఆ పంటలను సాగుచేసి లాభాలు పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ ఏ ఎన్.వెంకట్రాంరెడ్డి,ప్రొఫెసర్లు డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, డాక్టర్ జె.సురేష్,ఏవో ఎంఏ భాసిత్,ఏఎస్ఓ లు మంజుల,జె.జగదీశ్వర్,రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, రైతు సహకార సంఘం ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి,రైతులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి:ఎమ్మెల్యే





క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన టీంను అభినందిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి,మే12:** యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బొల్లారంలోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన ఫ్రెండ్స్ క్లబ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన టీంకు సోమవారం ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి ,వినయ్, జాన్ ,ప్రభాకర్ పాల్గొన్నారు.

## సీఎంఆర్‌లో ఎంఆర్ఐ సేవలు ప్రారంభం



ఎంఆర్ఐ పరికరాన్ని ప్రారంభిస్తున్న సీఎంఆర్ చైర్మన్ గోపాల్ రెడ్డి

**మేడ్చల్, మే 12:** సీఎంఆర్ దవాఖానలో ప్రారంభించిన ఎంఆర్ఐని వినియోగించుకోవాలని సీఎంఆర్ చైర్మన్ చామకూర గోపాల్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ వైద్య కళాశాల దవాఖానలో సోమవారం ఎంఆర్ఐ సేవలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో ఉండగా ఎంఆర్ఐ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## రెవెన్యూ సదస్సుకు 129 ఫిర్యాదులు



రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

**మేడ్చల్ కలెక్టరేట్, మే 12 :** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి, కుందన్‌పల్లి గ్రామాలకు సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు వివిధ భూ సమస్యలపై 129 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణ అనంతరం తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి భూసమస్యలు ఉన్నా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నేడు దివంగత మాజీఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సంతాపసభ

**కాప్రా, మే 12:** ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత బండారి రాజిరెడ్డి సంతాప సభను నిర్వహించనున్నారు. కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30లకు నిర్వహించే సంతాపసభకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అందరూ ఈ సంతాపసభకు విచ్చేసి దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి నివాళుర్పించే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు, నగదు స్వాధీనం

**కుత్బుల్లాపూర్:** పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేసిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొంపల్లి ఎన్సీఎల్ కాలనీ ప్లాట్ నంబర్-44 ఏ బ్లాక్ ఎమరాల్డ్ రెసిడెన్సీలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయంగా వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకోవడంతో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పెరిచెర్ల వీఎస్ఎన్ రాజు, చీరి నర్సింగరావు, ముల్కల మనోహర్, గుర్రాల రాఘవరెడ్డి, పడకంటి రాజు, జిన్నా రవీందర్‌రెడ్డిలను అదుపులోకి తీసుకొని వారి వద్ద లభించిన 83,920 నగదు, ఆరు ఫోన్లు, మూడు సెట్ల పేకాట ముక్కలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అర్హుల ఎంపికను వేగవంతం చేయాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాంబశివరావు

**మేడ్చల్, మే 12:** రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన వేగిరపర్చి, అర్హులను ఎంపిక చేయాలని రాజీవ్ యువ వికాస కమిటీ కన్వీనర్, డీఆర్డీవో సాంబశివ రావు అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన అర్హుల జాబితాను సంబంధిత శాఖల అధికారుల లాగిన్‌లోకి పంపాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ లో రాజీవ్ యువ వికాస పథకం అమలుపై సమీక్ష నిర్వహించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో రోజువారీగా దరఖాస్తుల పరిశీలన, పెండింగ్ వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు దరఖాస్తుదారులకు సిబిల్ వెరిఫికేషన్ అవసరం లేనందున ముందుగా వాటిని పరిశీలించి, బ్యాంక్‌ల ద్వారా ఎంపిక జాబితాను తెప్పించుకొని, కార్పొరేషన్ లాగిన్‌లోకి పంపాలన్నారు.దరఖాస్తుదారుల ఎంపిక విషయంలో సంబంధిత అధికారుల మానిటరింగ్ తప్పనిసరి అని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం వెంకటేశ్వర రావు, ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీ లక్ష్మి, జిల్లా ఉపాధిశాఖాధికారి రాధిక, మత్స్య శాఖ శాఖాధికారి, తదితరులు పాల్గొన్నారు.

## రోగుల ఆరోగ్య పరిరక్షణలో నర్సుల పాత్ర కీలకం



గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధి గౌరవెల్లి లోని సాకేత్ ప్రణామంలో నర్సులను సన్మానిస్తున్న కాలనీవాసులు

**మేడ్చల్ రూరల్, మే 12 :** రోగుల ఆరోగ్య పరిరక్షణకు నర్సులు గుండెకాయ లాంటి వారని జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ నాయకుడు వరప్రసాదరావు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి గౌడవల్లి గ్రామ శివారులోని సాకేత్ ప్రణామంలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల బారిన పడ్డ వారి పట్ల దయ, కరుణ, ఓదార్పుతో భరోసా ఇచ్చే సంరక్షకులు నర్సులని అన్నారు. ఈ సందర్భంగా సాకేత్ ప్రణామంలో పనిచేస్తున్న నర్సులు నక్షత్ర, శివకుమారిలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వల్లభేంద్రరెడ్డి, స్థానికులు కె. ఎమ్. కుమారి రామకృష్ణరాజు, రామ్మోహనరావు, శ్రీరామ్మూర్తి నాయుడు, నిర్మల పాల్గొన్నారు.

## కాలనీలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తా

కేపీహెచ్‌బీ కాలనీ, మే 12: కేపీబీహెచ్ కాలనీ 7వ పేజ్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ శ్రీనివాసరావు అన్నారు. కాలనీ 7వ పేజ్‌లో విద్యుత్ వీధి దీపాలు వెలగడంలేదని, వీధి కుక్కల బెడద పెరిగిందని, డ్రైనేజీ తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వైన్‌షాప్‌తో పోకిరిల వేధింపులు పెరిగాయని, ఫుట్‌పాత్ ఆక్రమణలు పెరిగాయని వంటి పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కాలనీ అడహక్ కమిటీ సభ్యులు ప్రతాప్, బత్తుల హరిబాబు, వేణుగోపాల్ బాబు పాల్గొన్నారు.

# విధులు మరిచాడు..'రియల్'కు మరిగాడు..

- పంపు ఆపరేటర్ రియల్ ఎస్టేట్ దందా
- ప్రభుత్వ స్థలం కబ్జా, పశువుల షెడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి పంపు ఆపరేటర్ నిర్మించుకున్న పశువుల షెడ్డు

**ఘట్‌కేసర్,మే 12:** పంపు ఆపరేటర్‌గా పని చేస్తున్న ఓ మున్సిపల్ ఉద్యోగి విధి నిర్వహణ మరిచి రియల్ దందాకు మరిగాడు. అదేమీ చాలదన్నట్లు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి షెడ్ నిర్మించుకొని పాల దందా చేస్తున్న వైనం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎన్ఎఫ్ నగర్‌లో వెలుగు చూసింది. ఎన్ఎఫ్‌సీనగర్ బీ- 1, సీ-2 కాలనీలకు మున్సిపల్ నీటిని సరఫరా చేస్తున్న పంపు ఆపరేటర్ తాగునీటి సరఫరా చేయడంలో నిర్లక్ష్యం చేస్తూ రియల్ దందాకే ప్రాధాన్యతనిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ప్రభుత్వ స్థలం కబ్జా, షెడ్డు నిర్మాణం

కాసులు కురిపిస్తున్న రియల్ దందాకే పరిమితం కాకుండా అతను మరో అడుగు ముందుకేసి పంపు ఆపరేటర్‌గా పని చేస్తున్న సంపు వద్దనే సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని దర్జాగా రియల్ దందా చేయడంతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశాడు. కబ్జా చేసిన స్థలంలో షెడ్ నిర్మించి ఆవులు, గేదెలు పెట్టి పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఉదయం ప్రజలకు తాగునీరు సరఫరా చేయటాన్ని విస్మరించి గేదె, ఆవు పాలను ఇంటింటికీ తిరిగి సరఫరా చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. రియల్ దందా కాసుల వర్షం కురిపిస్తుండటంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి పాడి నిర్వహిస్తున్న పంపు ఆపరేటర్ తనకు ఉద్యోగం ఉంటే ఎంత ఊడితే ఎంత అంటు విర్రవీగటంతో పాటు తనకు అడ్డు వచ్చినవారి అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. తాగునీటి సరఫరా ఎప్పుడు చేస్తావు అని స్థానికులు అడిగితే వచ్చినప్పుడే చూసుకోవాలి అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నాడు.

### అనుమతి లేని విద్యుత్ వినియోగం

ఎన్ఎఫ్‌సీనగర్ సీ-2 కాలనీలోని తాగునీటి సంపు వద్ద ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేసుకున్న పశువుల షెడ్‌కు అనుమతి లేని విద్యుత్‌ను వాడుతున్నట్లు తెలిసింది. రాత్రి సమయంలో షెడ్డులో నిరంతరం విద్యుత్ దీపాలు వెలుగుతునే ఉంటాయి. కాగా అధికారుల అండదండలతో పాటు అధికార పార్టీ మద్దతు ఉన్నందున తనను ఎవరు ఏమి చేయలేరని చెబుతూ విర్రవీగుతున్నాడు.గతంలో అధికారుల పర్యటనలో స్థలం కబ్జా విషయం వారి దృష్టికి వచ్చినప్పటికీ కబ్జా విషయాన్ని సదరు అధికారులు పట్టించుకోలేదని స్థాకులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు ఈ విషయమై విచారణ జరిపి విధుల పట్ల నిర్లక్ష్యంతో పాటు కబ్జా చేసిన ప్రభుత్వ భూమిలో షెడ్డు నిర్మాణం చేసి నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వాడకంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

తాగునీటి సరఫరా పట్ల నిర్లక్ష్యం చేయటంతో రోడ్డు స్థలాన్ని కబ్జా చేయటం పట్ల విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఘట్‌కేసర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్ రెడ్డి తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**ఘట్ కేసర్, మే 12:** ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి బాలాజీనగర్ లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బాలాజీ నగర్‌లో గుటుకు శ్రీశైలం(45) నివాసం ఉంటూ కీసర మండలం బోగారంలోని లిక్కర్ గోడౌన్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలయ్యాడు. దీంతో దంపతుల మధ్య కలహాలు నెలకొన్నాయి. భార్య పుట్టింటికి వెళ్లటంతో మూడు నెలలుగా ఒంటరిగా ఉంటున్న శ్రీశైలం తరుచూ భార్యతో అప్పుల విషయమై గొడవ పడుతుండేవాడు. సోమవారం శ్రీశైలం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని కాశమ్మ భార్యకు సమాచారం అందించింది. ఇంటికి చేరుకున్న భార్య తలుపులు తొలగించి చూడగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పంచనామా జరిపి శవాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించి మృతుని కూతురు సోహన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ బధిరుల బాలుర ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**మలక్‌పేట, మే 12:** మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ బధిరుల బాలుర ఆశ్రమ పాఠశాలలో 2025-2026 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రిన్సిపాల్ కే. నాగలక్ష్మి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి విద్యార్థులు ఈ పాఠశాలలో అడ్మిషన్లు పొందవచ్చునని, పాఠశాలలో అడ్మిషన్లు పొందగోరే విద్యార్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని ఆమె సూచించారు. పాఠశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు విద్యాబోధనతో పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతి,యూనిఫామ్‌లు, కాస్మెటిక్ చార్జీలు ఇస్తామని ఆమె తెలిపారు. పాఠశాల పని దినాల్లో (సెలవు రోజుల్లో కాకుండా) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అడ్మిషన్లు తీసుకోబడతాయని ఆమె తెలిపారు. వివరాలకు 76749 33347, 9000 221 301 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

### 2025లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత

2024- 2025 విద్యాసంవత్సరానికి గాను ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాలలోని 23 మంది విద్యార్థులకు గాను 15 మంది ఫస్ట్ క్లాస్‌లో, 8 మంది విద్యార్థులు సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యారని ఆమె తెలిపారు.

జిల్లాలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత ను సాధించిన మొదటి పాఠశాలగా గుర్తింపు లభించిందని ఆమె పేర్కొన్నారు.

## అంతర్గత కాలనీల్లో పక్కా రహదారులు

మియాపూర్,ఏప్రిల్ 12: కాలనీ ఇండ్లల్లోని అంతర్గత రహదారులలో పక్కారహదారుల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్ని శ్రీనివాస రావు పేర్కొన్నారు. పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీ లో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, ఎక్కువ కాలం మన్నేలా చూడాలని సూచించారు. రహదారులు తాగునీరు డ్రైనేజీ వరద కాలువల నిర్మాణం వంటి వసతులను అన్ని కాలనీల్లో పూర్తిస్థాయిలో కల్పించే దిశగా ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇం అధికారులు, పాల్గొన్నారు.

## నూతన నియామకం



చంద్రశేఖర్‌కు నియామక పత్రం అందజేస్తున్న జేబీ రాజు

**మల్లాపూర్, మే 12:** రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లాపూర్ డివిజన్ అశోక్ నగర్కు చెందిన నాగారం చంద్రశేఖర్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకుడు ఐఏఎస్ క్యాడర్ డాక్టర్ జేబీ రాజు చేతుల మీదుగా నియామక పత్రాన్ని చంద్రశేఖర్ కు అందజేశారు. నాగారం చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా, కులాలకు మతాలకు అతీతంగా సోదర భావంతో అంబేద్కర్ భావజాలాన్ని ప్రచారం చేస్తానని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాలపై సదస్సులు సమావేశాలు ఏర్పాటు చే స్తానన్నారు.

## కేంద్ర మాజీ మంత్రి ఎంఆర్ కృష్ణ చిరస్మరణీయుడు



అల్వాల్‌లో పేదలకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

**మల్కాజిగిరి,మే 12:** కేంద్ర మాజీ మంత్రి ఎంఆర్ కృష్ణ చిరస్మరణీయుడని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం కేంద్ర మాజీ మంత్రి ఎం ఆర్ కృష్ణ వర్ధంతి సందర్భంగా భీమ్రావు అంబేద్కర్ వీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరంలో పేదలకు బియ్యాన్ని కార్పొరేటర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, బిఎస్ గిల్ ,కే వేణు( బబ్లు), సురేందర్ రెడ్డి , శంకర్, రాకేష్, జార్జ్, ప్రేమ కుమార్, యాదగిరి గౌడ్, సాజిత్ ,అనిల్ రాజు ఉన్నారు.

**PUBLIC NOTICE**

Under the instructions of my client Sri. Nannapuraju Deelip Kumar, S/o. Sri. Nannapuraju Venkamraj, this public notice is being issued in general are hereby informed that my client lost the original Registered Sale Deed No. 6491/2005, pertaining to All that the Residential Flat No. 201, in the Second Floor bearing Municipal No. 35-80/201, of NEHA PLAZA, covered with a plinth area of 975 Sft., which includes all common and general parking areas and associated with an undivided share of land of 27 Sq. Yards., (out of 217 Sq. Yards.,) in H. No. 35-80, on Plot No. 58, in Sy. Nos. 230/1, 230/2, 231/1, 231/2, & 232, situated at Gopala Krishna Nagar, Ramakrishnapuram, Under Malkajgiri Municipality, & Mandal, Medchal - Malkajgiri District., Any Person/ institution/ authority having custody of the above said original link sale deed, may have produce/ give with relevant documents within 7 days hereof, the under signed and my client request not to misuse/transact with the above stated documents from any persons/ institution and etc. Hence, this public Notice for lost of above stated documents.

**Sd/- M/S ARUN AND ASSOCIATES, ADVOCATES**
# Room No. 6, 4th Floor,
Srinath Commercial Complex, S.D. Road,
Patny Center, Secunderabad-03,
**Phone: 8008059359.**